క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలు, స్థానిక సమస్యలపై మాట్లాడారు. - జగదాంబ

గౌరీపరమేశ్వరులను దర్శించుకున్న వాసుపల్లి



గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై శ్రీ వెంకట గౌరీశంకర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరులను శనివారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు స్వాగతం పలికారు. అమ్మవారికి వాసుపల్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవ చేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పాల్గొనే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తోపుడుబండ్ల కార్మికులపై దాడులు అన్యాయం

డాబాగార్డెన్స్: తోపుడుబండ్ల కార్మికులపై జీవీఎంసీ, పోలీసులు చేస్తున్న దాడులు తక్షణమే ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. 22వ వార్డు శివాజీపాలెం, పిఠాపురం కాలనీలో చిరువ్యాపారాలు చేసుకుంటున్న వారి బడ్డీలు, బళ్లను జీవీఎంసీ అధికారులు, పోలీస్ అధికారులు మోహరించి బుల్ డోజర్లు, జేసీబీలు తీసుకొచ్చి బలవంతంగా తొలగించారన్నారు. కొన్నేళ్లుగా అక్కడే జీవిస్తున్న చిరు వ్యాపారులపై దాడులు చేసి వారి ఆస్తులను ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. వారికి అండగా ఉండాల్సిన వార్డు కార్పొరేటరే కక్ష కట్టి కోర్టుకు వెళ్లి చిరువ్యాపారులపై దాడులు చేయడం అత్యంత దారుణమన్నారు. అప్పులు చేసి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఉపాధి చూపకపోగా ఈ రకమైన దాడులు చేసి కార్మికులను రోడ్డున పడేయడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎక్కడ వ్యాపారం చేసుకుంటున్న వారిని అక్కడే వ్యాపారం చేసుకోనివ్వాలని కుమార్ డిమాండ్ చేశారు. తోపుడు బళ్లు, చిరువ్యాపారులకు సిటూ అండగా పోరాడుతుందని చెప్పారు.

పూట గడిచేదెలా..?

- కులవృత్తిదారుల కడుపుకొట్టిన కూటమి ప్రభుత్వం
- చేదోడు పథకాన్ని నీరుగార్చిన పాలకులు
- అందని ద్రాక్షలా రూ.10 వేల ఆర్థిక సాయం



లాండ్రీ చేస్తున్న రజకుడు రాజులు



హెయిర్ కట్ చేస్తున్న మహేష్

జగదాంబ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తే.. కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని సంక్షోభంగా మార్చి కులవృత్తిదారుల కడుపుకొడుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని మాటిచ్చి చివరికి ఆరు పథకాలనే తెరపైకి తీసుకొచ్చారు. అవి కూడా సక్రమంగా అమలవుతాయా అంటే.. ప్రశ్నార్థకమే. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా.. సంక్షేమ కోసం ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి పేదలకు కన్నీరు మిగులుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు, చేనేత కార్మికులకు ఏడాదికి ఇవ్వావల్సిన రూ.10 వేలు ఆర్థిక సాయం మాటెత్తడం లేదంటున్నారు. ఓట్ల కోసమే పథకాల పేరు చెప్పి మోసం చేశారని మండిపడుతున్నారు. ప్రభుత్వ సాయం అందక.. చేస్తున్న వృత్తిలో సంపాదన లేక పూట ఎలా గడుస్తుందంటూ పలువురు చేతివృత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ మొదటికే..

దక్షిణ నియోజకవర్గంలో సుమారు 200 మంది వరకు కులవృత్తిదారులున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీరికి చేదోడు పథకం ద్వారా అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంది. నాలుగేళ్లుగా లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ సాయాన్ని మూన్నాళ్ల ముచ్చట చేసింది. గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్ధిదారులందరి బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేల ఆర్థిక సాయం జమయ్యేదని, నేడు నెలల తరబడి ప్రభుత్వ సాయం అందుతుందో.. లేదో అని ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించిందని పలువురు కులవృత్తిదారులు వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వం తమ గోడు పట్టించుకుని ఆర్థిక సాయం అందజేయాలని వారంతా కోరుతున్నారు.

నమ్మించి మోసం చేశారు

కూటమి నేతలు నమ్మించి మోసం చేశారు. పథకాలు ప్రవేశ పెట్టకపోగా ఉన్న వాటిని తీసేసి కుల, చేతివృత్తిదారుల పొట్టకొట్టారు. దీని వల్ల ఎందరో పేదలు రోడ్డున పడ్డారు. మా పరిస్థితిని పాలకులు పట్టించుకోవాలి.

– మహేష్, నాయీ బ్రహ్మణుడు, పందుపుల్లల సందు

ఆదుకోండి

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను గుర్తించి చేదోడు పథకం అమలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదోడి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మాలాంటి గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– రాజులు, రజకుడు, లాండ్రీ దుకాణం, 35వ వార్డు

పెన్షనర్ల ధర్నా



ధర్నాలో పాల్గొన్న పింఛన్‌దారులు

సీతమ్మధార: కార్మికులంతా వ్యతిరేకిస్తున్నా సరే కేంద్ర ప్రభుత్వం శనివారం ఈపీఎస్–95 పెన్షన్ స్కీమ్ ప్రవేశపెట్టడాన్ని పలువురు వక్తలు తప్పుపట్టారు. ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏపీఆర్‌పీఏ) ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ పార్కులో పింఛన్‌దారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్మికులకు ఆప్షన్ కూడా ఇవ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించామని గుర్తుచేశారు. దీంతో ప్రతి పదేళ్లకోసారి సమీక్షించి మెరుగులు దిద్దుతామని కేంద్రం కోర్టుకు హామీ ఇవ్వగా.. కోర్టు కూడా కేంద్రానికి అనుకూలంగా తీర్పు చెప్పిందన్నారు. పదేళ్ల తరువాత రివ్యూ పేరిట 1/3 వంతు పింఛన్ అమ్ముకునే హక్కు, భర్త చనిపోతే భార్యకు బీమా కల్పించే హక్కును తొలగించి కేంద్రం కార్మికులకు ద్రోహం చేసిందని వాపోయారు. గత ఎన్నికల ముందు బీజేపీ అధికారంలోకి వస్తే కనీస పింఛన్ రూ.9 వేలతోపాటుగా డీఏ అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీజేపీ కూటమి వచ్చి పదేళ్లు దాటినా.. కనీస పింఛన్ పెరగలేదన్నారు. ఈపీఎస్ స్కీమ్ 95 ప్రవేశపెట్టిన రోజును విద్రోహ దినంగా పాటిస్తున్నామని తెలిపారు. సంఘ నాయకులు యు.వి.ఎస్.ఎన్.వర్మ, కె.దీనబంధు, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, అధిక సంఖ్యలో పింఛనర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీలో సమయపాలన మాసోత్సవాలు

డాబాగార్డెన్స్: ఏపీఎస్ఆర్టీసీ విశాఖ జిల్లాలోని అన్ని డిపోల్లో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15 వరకు నిర్వహించనున్న సమయపాలన మాసోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్ని డిపోల్లో మేనేజర్ల ఆధ్వర్యంలో కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బందికి గేటు మీటింగ్‌ల ద్వారా సమయపాలన ఆవశ్యకతను తెలియజేయనున్నారు. ప్రయాణికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా షెడ్యూల్ సమయాల ప్రకారం బస్సులు నడపాలని తదితర విషయాలను జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ద్వారకా బస్ స్టేషన్‌లో నిర్వహించిన మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో సూచించారు. కండక్టర్లు, డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం పన్ను వసూలు



మాట్లాడుతున్న డీసీఆర్ శ్రీనివాస్

జగదాంబ: ట్యాక్స్ కలెక్షన్లు వంద శాతం చేయాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ రెవెన్యూ ఎస్.శ్రీనివాస్ ఆదేశించారు. సూర్యాబాగ్‌లోని జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో శనివారం రెవెన్యూ అధికారులు, సెక్రటరీలు, ట్యాక్స్ కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డుల్లోని సచివాలయాల పరిధిలో సెక్రటరీలు, ఆర్ఐలు సిబ్బంది నిర్ణయించిన టార్గెట్లను తీసుకుని ఆస్తి, నీటి పన్నులు వసూలు చేసి, జీవీఎంసీకి ఆదాయం పెంచాలన్నారు. కొత్త పన్ను విధానం ప్రకారం వసూలు చేయాలని చెప్పారు. కుళాయి పన్ను చెల్లించని వారి ఇంటి నీటి కుళాయి కట్ చేయాలని, పాతబకాయిలు, మొండిబకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అప్పటికీ చెల్లించని పక్షంలో ఆస్తి జప్తు నోటీసులు పంపాలన్నారు. పన్ను చెల్లింపులు చేసే వారి నుంచి చెక్‌లు తీసుకోకుండా కమిషనర్ జీవీఎంసీ పేరుతో డీడీలు తీసుకోవాలని సూచించారు. గతంలో చెక్‌లు ఇచ్చి ఇప్పటికీ పన్నులు చెల్లించని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. షాపింగ్ మాల్స్, కళాశాలలు, అపార్ట్‌మెంట్‌లు, ఖాళీగా ఉన్న ఇంటి స్థలాలు వంటి వాటి నుంచి పన్ను వసూలు చేయాలని చెప్పారు. సెక్రటరీలు, ట్యాక్స్ కలెక్టర్లతో ఆర్వోలు, ఆర్ఐలు కో ఆర్డినేషన్ చేసుకుని పనిచేయాలన్నారు. జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యానాయుడు, ఆర్వోలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్



మొక్క నాటుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌లో శనివారం కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌లోని మొక్కల గురించి పర్యవేక్షకుడు రామమూర్తిని అడిగి ఆయన తెలుసుకున్నారు. అరుదైన మొక్కల గుణాలు, విశేషాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

ఉత్సాహంగా మహిళా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్



టోర్నీ విజేతలతో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ, సిబ్బంది

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన ఏయూ అంతర్ కళాశాలల మహిళా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ముఖ్య అతిథి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్ ఆచార్య విజయమోహన్ పోటీలను ప్రారంభించారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చూపారు. టోర్నీ విజేతలుగా ఏవీఎన్, బుల్లయ్య, సెయింట్ జోసెఫ్ కళాశాలలు నిలిచాయని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో విజేతలకు సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ చేతుల మీదుగా ట్రోఫీ, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డాక్టర్ పి.కె.జయలక్ష్మి, కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.17.98 లక్షలు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 28 రోజులకు గానూ రూ.17.98 లక్షల నగదు, బంగారం 3 గ్రాముల 027 మిల్లీగ్రాములు, వెండి 0.101–100 మిల్లీ గ్రాములు, అమెరికా డాలర్లు 20, యూఏఈ దిర్హమ్‌లు 10, ఎస్‌బీఐ చెక్కులు 111 లభించాయని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. శివజ్యోతి, సేవా సంఘం సభ్యులు, దేవస్థానం సిబ్బంది ఆదాయాన్ని లెక్కించారు. దేవస్థానం ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.బోశన్, దేవదాయశాఖ తనిఖీదారుడు ఎం.శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్జీవో కమిటీలో ప్రగడ వాసు

సీతమ్మధార: మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ తేజ్ భరత్ రాష్ట్రంలోని నిరాశ్రయుల వసతి గృహాల నిర్వాహకులు, మెప్మా అధికారులతో శనివారం తాడేపల్లి నుంచి జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. 11 మంది ప్రతినిధులతో కూడిన స్వచ్ఛంద సంస్థలఎన్జీవో కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఎన్జీవో కమిటీ ఏర్పాటుతోపాటు విధానపరమైన అంశాలపై చర్చించారు. ఈ కమిటీలో విశాఖ నుంచి ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసుకు చోటు దక్కింది.

నర్సులకు పదోన్నతులు కల్పించండి



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు మొక్క అందిస్తున్న గంగాభవాని తదితరులు

మహారాణిపేట: ప్రభుత్వ నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగాభవాని కోరారు. శనివారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని కలెక్టర్‌కు ఆమె పరిచయం చేశారు. పదోన్నతుల విషయంలో నర్సులకు అన్యాయం జరుగుతోందని, దీనిని సవరించాలని సంఘ జిల్లా కార్యదర్శి వరలక్ష్మి కోరారు. సంఘ నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వెంకట శేషమ్మ

మహారాణిపేట: బాల కార్మిక చట్టం, కనీస వేతనాల చట్టం అమలు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో పాన్ ఇండియా బాల రక్షణ, పునరావాసం ప్రచారం అనే అంశంపై శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక చట్టాల గురించి వివరించారు. ప్రతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అదనపు కమిషనర్ ఎం.సునీత, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరి నుంచి కేజీ వంద గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీతంపేట రెల్లివీధికి చెందిన సాండి అరవింద్, కనకమ్మ వీధికి చెందిన నవీన్ కలిసి సీతమ్మధార బిలాల్‌కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎస్ఐ జె.ధర్మేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి నిందితులను అరెస్ట్ చేశారు. అరవింద్‌పై మూడు, నవీన్‌పై ఆరు కేసులు గతంలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ ధర్మేంద్ర దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబర్ 16,17 తేదీల్లో యువజనోత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న ప్రజానాట్య మండలి, ఏఐటీయూసీ ప్రతినిధులు

అల్లిపురం: కళలు, సాహిత్యంపై అభిరుచి, మమకారం గల నేటితరం యువకులను ప్రోత్సహించేందుకు డిసెంబర్ 16, 17 తేదీల్లో విజయవాడలో యువజనోత్సావాలు నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్య మండలి ప్రతినిధులు తెలిపారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ నెల 25న అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగే ఎంపికలో ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు. ఆసక్తి గల యువ రచయితలను గుర్తించేందుకు యువజనోత్సవాలు దోహదపడతాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.రాంబాబు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎస్.అప్పన్న తదితరులు తెలిపారు. ఈ అవకాశాన్ని యువజనులు వినియోగించుకోవాలని సూచించారు.

గ్రంథాలయ ఉద్యమ నేతలకు నివాళి



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు.. పర్యవేక్షిస్తున్న శ్రీనివాసరావు, పద్మావతి తదితరులు

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయ ఉద్యమ నేతల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. గీతం యూనివర్సిటీ గ్రంథాలయ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయ అధికారి బి.ఎ.పద్మావతిదేవి, కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు తదితరులు గ్రంథాలయ ఉద్యమ నేతల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల శాఖ గ్రంథాలయంలో..

పూర్ణామార్కెట్ దరి రంగిరీజువీధిలోని బాలల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ నేతలు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరి సర్వోత్తమరావు ఉద్యమ నేతల చిత్రపటాలకు ఏవీఎన్ కళాశాల గ్రంథాలయ అధికారి ఎం.స్వరాజ్యలక్ష్మి, బాలల శాఖ గ్రంథాలయ అధికారి టి.పోలితల్లి, పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ నేతల గురించి వివరించారు. అనంతరం ఆమెను సత్కరించారు. సీనియర్ పాఠకులు అప్పలరాజు, పుల్లయ్య. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి రూ.10 వేల సాయం



లండ నూకరాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లండ నూకరాజుకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేల సాయం అందజేశారు. 38వ వార్డు బుక్కావీధికి చెందిన లండ ఎర్రమ్మ కుమారుడు లండ నూకరాజును శనివారం ఆస్పత్రికి వెళ్లి ఆయన పరామర్శించారు. తన సొంత నిధులతో వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి పేషెంట్ బిల్లులో రూ.40 వేలు తగ్గించేలా ఏర్పాటు చేశారు. పేదల కష్టాలే తన కష్టాలుగా భావించే వాసుపల్లి తన సేవలు కొనసాగించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలతో తనది విడదీయరాని బంధమని, చిన్ననాటి నుంచి పెరిగిన ఈ ప్రాంతీయులతో తన జీవితం తెలియకుండానే ముడిపడి పోయిందన్నారు. ఈ ప్రాంత ప్రజల కష్టాల్లో తాను కూడా అండగా ఉండేలా సాయం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, గనగళ్ల రామరాజు, వాసు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం ఆస్పత్రి కార్మికుల మహాధర్నా



వంటావార్పులో ఎంజీఎం సెవెన్‌హిల్స్ ఆస్పత్రి కార్మికులు



మహాధర్నాలో పాల్గొన్న ఆస్పత్రి కార్మికులు

- తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వంటావార్పు

సీతమ్మధార: ఎంజీఎం–సెవెన్‌హిల్స్ ఆస్పత్రి యాజమాన్య తీరుకు వ్యతిరేకంగా కార్మికులు శనివారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద 24 గంటల మహాధర్నా, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఎంజీఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం తీవ్ర వేధింపులకు గురిచేస్తోందన్నారు. హాస్పిటల్ ఆర్థిక సంక్షోభంలో ఉందని, అందుకే కార్మికులను తొలగిస్తున్నామని యాజమాన్యం కుంటిసాకు చెప్పి నిర్బంధంలో ఉంచి నోటీసులు మీద హెచ్ఆర్ అధికారి సంతకాలు చేయించడం చట్ట విరుద్ధమన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్ కార్మికులను తొలగించి జూనియర్ కార్మికులను కొనసాగించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. జిల్లా కార్మిక శాఖ అధికారులు కార్మికుల బతుకులతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ఎంజీఎం సెవెన్ హిల్స్ యాజమాన్యం నోటీసులు వెనక్కి తీసుకోకపోతే సమ్మె చేయడానికి కార్మికులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. 15 రోజుల బకాయి జీతాలు పెనాలీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.రాజు, ఎం సుబ్బారావు, కె.చంద్రశేఖరం, నూకరాజు, లావణ్య, రమణమ్మ వెంకటరావు, నాయుడు, పుష్ప, ఎస్.రవణమ్మ, సిహెచ్.ధనలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



డీఎంహెచ్‌వో జగదీశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు

మహారాణిపేట: తమ సమస్యలు పరిష్కరించాలని తెలుగునాడు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం కోరింది. శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావును సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచార్యులు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ఉద్యోగులు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి సోమ, మంగళవారాల్లో ఏఎన్ఎంలకు ఇతర పనులేమి కేటాయించద్దని, వారి రీడిప్లయిమెంట్ రద్దు చేయాలని, రెగ్యులర్ అయిన హెల్త్ అసిస్టెంట్ల సీనియార్టీ లిస్టు ఎంపీహెచ్ఎస్ పదోన్నతి కోసం తయారు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతానికి వేసిన హెల్త్ అసిస్టెంట్లను రీబ్యాక్ చేయాలన్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడు నగేష్ పట్నాయక్, ప్రధాన కార్యదర్శి రామునాయుడు, ఉపాధ్యక్షుడు రమణ, మురళీ, ఇతర హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అయ్యప్ప తిరువీధి ఉత్సవం





రథంపై ఊరేగుతున్న అయ్యప్ప, తిరువీధిలో అయ్యప్ప విగ్రహాన్ని మోసుకొస్తున్న మాలధారులు

అల్లిపురం: కేరళలోని అయ్యప్ప దేవాలయం తెరుస్తున్న సందర్భంగా శనివారం అయ్యప్ప స్వాములు తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సౌత్ జైలురోడ్డులోని బీఆర్ రెడ్డి జంక్షన్ నుంచి గురుస్వామి నీలాపు రమణారెడ్డి ఆధ్వర్యంలో టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలోని ధర్మశాస్త ఆలయం వరకు ఊరేగింపు సాగింది. అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి రథాన్ని లాగుతూ స్వామి నామస్మరణతో 108 కలశాలతో అయ్యప్ప మాలధారులు, కేరళ మహిళల వాయిద్యాలతో నేత్రపర్వంగా తిరువీధి నిర్వహించారు. అనంతరం కలశాలలోని పాలతో అయ్యప్పస్వామి మూలవిరాట్టుకు ఆలయ అర్చకుడు భార్గవశర్మ అభిషేకం చేశారు. అయ్యప్పను పూలతో విశేషంగా అలంకరించారు. అయ్యప్ప నామస్మరణతో దేవాలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.